# మనకు శిశువు పుట్టెను

(యెషయా 9:6 ఏలయనగా మనకు శిశువు పుట్టెను..)

700 వందల సంవత్సరాలకు ఈ వచనం నెరవేరింది. దేవుని ప్రవక్త భవిష్యత్తులో చూస్తూ ఆ రాబోయే సంఘటన అంతకు ముందు జరిగినట్టు యెషయ ప్రవక్త రాశాడు. యేసు జననానికి ఏడు శతాబ్దాల పూర్వం యెషయా ఆయన గురించి ఇలా ప్రవచించాడు: "ఏలయనగా మనకు శిశువు పుట్టెను మనకు కుమారుడు అనుగ్రహింప బడెను ఆయన భుజముమీద రాజ్యభారముండును." యెషయా9:6 యేసు జననం, ఆ తర్వాత ఆయన వహించే పాత్ర ఎంతో విశేషమైనవై ఉంటాయని యెషయా ఎందుకు సూచించాడు? ఎందుకంటే యేసు పరిపాలన "న్యాయము వలనను నీతివలనను" స్థిరపరచబడుతుంది.—యెషయా 9:7.

యేసు జన్మిస్తాడనే విషయాన్ని గబ్రియేలు దూత మరియకు చెప్పినప్పుడు, యెషయా ప్రకటననే ప్రతిధ్వనింప జేశాడు. "ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును; ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయన కిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును; ఆయన రాజ్యము అంతము లేనిదై యుండును" అని ఆయన జరగబోయేదాన్ని ముందుగానే చెప్పాడు. (లూకా 1:32, 33)

## ఎవరు ఈ శిశువు

### 1. ఈ శిశువు మనలను బ్రతికించుటకు వచ్చిన వాడు

ఎఫె. 2: 1,4 మీ అపరాధముల చేతను పాపముల చేతను మీరు చచ్చినవారైయుండగా, ఆయన మిమ్మును క్రీస్తుతో కూడ బ్రదికించెను. అయినను దేవుడు కరుణా సంపన్నుడై యుండి, మనము మన అపరాధముల చేత చచ్చినవారమై యుండినప్పుడు సయితము మనయెడల చూపిన తన మహా ప్రేమచేత మనలను క్రీసుతో కూడ బ్రదికించెను.

### 2. ఈ శిశువు, కుమారుడిగా వచ్చిన వాడు

"కుమారుడు అనుగ్రహింప బడెను" యెషయా 9:6  యేసుప్రభువు యొక్క మానవత్వం ఇక్కడ కనిపిస్తున్నది. ఆయన మహా బలిష్ఠుడైన దేవుడు. అయినప్పటికీ చిన్న బాబుగా జన్మించాడు. దేవుడు మానవుడుగా జన్మించడం అన్ని అద్భుతాలోకెల్లా గొప్ప అద్భుతం. ఫిలిప్పీయులకు 2:6,7,8 ఆయన దేవుని స్వరూపము కలిగినవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెను. మరియు, ఆయన ఆకారమందు మనుష్యుడుగా  కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్నుతాను తగ్గించుకొనెను.

## 3. ఈ శిశువు మనలను పాపము నుండి విమోచించుటకు వచ్చిన వాడు

కుమారుడు అనగా కు+మారః (చెడును హరించువాడు). సమస్త మానవుల పాపములను పరిహరించి పరలోక ప్రవేశాన్ని అనుగ్రహింప వచ్చిన శిశువు. “కాబట్టి నమ్ముువారు ఆయన కృపచేతనే, క్రీస్తుయేసునందలి విమోచనము ద్వారా  ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు” రోమీయులకు 3:24.; “దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టి యున్నాడు”.  లూకా 2:11;

## 4. ఈ శిశువు మనకు సంతోషాన్ని ఇచ్చుటకు వచ్చిన వాడు

“అయితే ఆ దూత భయపడకుడి; ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను”. లూకా 2:10; కుమారుడైన యేసుద్వారా పాపనిర్మూలన చేయబడి పరలోక ప్రవేశం అనుగ్రహింప బడినదనే సంతోషము మనకు కలుగు చున్నది. “ నా ఆత్మ నా రక్షకుడైన దేవునియందు ఆనందించెను”. లూకా 1:48;

## 5. ఈ శిశువు మనకు వెలుగును ఇచ్చుటకు వచ్చిన వాడు

సాతాను అంధకార బంధకాలను తొలగించి నిజమైన వెలుగును మనకు ప్రకాశింపజేయుటకు వచ్చిన శిశువు. గలలీ ప్రాంతాల్లో ప్రకాశించనున్న గొప్ప కాంతిగా ఈ శిశువు ఉన్నాడు. “చీకటిలో నడుచు జనులు  గొప్ప వెలుగును చూచు చున్నారు మరణచ్ఛాయగల దేశనివాసుల మీద వెలుగు ప్రకా శించును”. యెషయా 9:2

అంధకారములో ఉన్న గొర్రెల కాపరుల జీవితాలలో వెలుగు ప్రకాశించనట్లు పాపుల జీవితాలలో వెలుగు నింపుటకు వచ్చినవాడు ఈ శిశువు. “ప్రభువు దూత వారియొద్దకు వచ్చి నిలిచెను; ప్రభువు మహిమ వారిచుట్టు ప్రకాశించినందున, వారు మిక్కిలి భయపడిరి”. లూకా 2:9 ;

## 6. ఈ శిశువు రాజుగా ఏలుటకు వచ్చినవాడు

“ఆయన భుజము మీద రాజ్య భారముండును”. యెషయా 9:6 ; “నా కొరకు ఇశ్రాయేలీయులను ఏలబోవువాడు నీలోనుండి వచ్చును”. మీకా 5:2; ఆ పిల్లవాడు పెరిగి యూదుల రాజుగా, ప్రపంచానికే రారాజుగా ఉండడానికి పెరిగాడు

“ఇది మొదలుకొని మితిలేకుండ దానికి వృద్ధియు క్షేమ మును కలుగునట్లు సర్వకాలము దావీదు సింహాసనమును రాజ్యమును నియమించును న్యాయమువలనను నీతివలనను రాజ్యమును స్థిరపరచు టకు అతడు సింహాసనాసీనుడై రాజ్య పరిపాలన చేయును”. యెషయా 9:7

## 7. ఈ శిశువు మనకు తోడుగా ఉండి చివరి వరకు నడిపించుటకు వచ్చినవాడు

“ఇదిగో కన్యక గర్భవతియై *కుమారుని* కనును ఆయనకు ఇమ్మానుయేలను పేరు పెట్టుదురు అని ప్రభువు తన ప్రవక్తద్వారా పలికిన మాట నెరవేరు నట్లు ఇదంతయు జరిగెను. ఇమ్మానుయేలను పేరునకు భాషాంతరమున దేవుడు మనకు తోడని అర్థము”. మత్తయి 1:22,23;

శాంతికరమైన జలములయొద్ద నన్ను నడిపించుచున్నాడు.... తన నామమునుబట్టి నీతిమార్గములలో నన్ను నడిపించు చున్నాడు. కీర్తన 23:2,3